


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

## -176-

(30 ఏప్రిల్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఒక వ్యక్తిని గురించి** ఇతరులు తాపత్రయపడటం ఆయన క్షేమం కోసం ప్రార్ధనలు, పూజలు చెయ్యడం, వారినీ, వారి కుటుంబాల్నీ తలచుకుని జాలి ప్రకటించడం ఇలాటివి సమాజంలో కొంచెం తలపైకెత్తుకున్న వారి విషయంలో జరుగుతూ వుంటాయి.

ఆ వ్యక్తి దేశ సేవా నిరతి, త్యాగం, లేదా మేధాసంపద వగైరాలనుబట్టి ప్రజానీకానికి అలాంటి భావనలు కలుగుతూ వుంటాయి. అందరి ప్రాణాలూ, ఆధ్యాత్మికరీత్యా ఒకటే అయినా గొప్పవారి విషయంలో అలాంటి తాపత్రయం కలగడం ధర్మం.

కానీ, అంతకు ముందు పేరూ, వూరూ కూడా తెలియని ముగ్గురు సామాన్య వ్యక్తులను గురించి ప్రపంచమంతా తాపత్రయపడటం, ప్రార్ధనలు జరపడం, అనేది మొన్న వ్యోమగాములు అంతరిక్షంలో దురదృష్టవశాత్తూ, తమ వాహనం చెడి అపాయ స్థితిలో వున్నప్పుడు జరిగినట్లు మరెప్పుడూ జరిగివుండలేదేమో.

ఒక దేశమంటూ కాదు, ఒక జాతి అంటూ కాదు, మానవకోటి అంతా రోదసిలో ప్రాణరక్షణకై ఈదులాడుతున్న ఆ ముగ్గురు వ్యక్తులపైన వారి కుటుంబాలపైన చూపిన సానుభూతి, ప్రకటించిన జాలి అనుపమానంగా భావించాలి.

ఎవరి నోటవిన్నా లోవెల్, స్వైగర్టు, హెజ్‌లనే పేర్లే వినిపించాయి.

ఇందులో ఒకాయన బ్రహ్మచారి. తక్కిన వారిద్దరూ కుటుంబీకులు. అసలు భర్తలు చంద్రలోక యాత్ర సాగించడానికి బయలుదేరితే సాహసంతో సమ్మతించడమే గొప్ప త్యాగం.

అలాంటిది రోదసీలో వారి శకటానికి ప్రమాదం ఏర్పడిందనీ, వారు ప్రాణాపాయ స్థితిలో వున్నారనీ, తెలిసినప్పుడు వారి సతీమణుల పిల్లల మనస్సులెలా వుంటాయో ఊహించడం కష్టం.

"పాపం? ఆ ఇల్లాళ్ళెలా కన్నీళ్ళు కారుస్తూ ఆకాశం వంక చూస్తున్నారో.. వారి ప్రాణాలు అక్కడ వున్నాయి. చంద్రలోకానికి చేరి ఖ్యాతి సంపాదిస్తారని పంపితే ఇలా అయింది అని వారెంత రోదిస్తున్నారో, రోదసీలో గల ప్రాణనాధుల్ని తలచుకుని" అని ఒకామె ఎంతో విచారం వెలిబుచ్చిందానాడు.

"నిజంగా వారి ఇల్లాళ్ళ మనోవేదన విని వ్యాసంగా వ్రాయవలసిందే. ఎంతైనా వ్రాయవచ్చు" అని మరో ఆవిడ అంది.

ఆ మాట విని మొదటి ఆమె అంది, "వ్రాస్తే మీరే వ్రాయాలి.. సంసారాలు చేస్తున్నవారు.. నాకు వివాహమే కాలేదాయె" అని విచారం వెలిబుచ్చింది.

"పోనీ అందులో ఒక బ్రహ్మచారి వున్నాడుగా. అతణ్ణి గురించి ఆవేదన పడేవాళ్ళేవరూ వుండరు. అతణ్ణి గురించిన ఆవేదన ప్రకటించడం న్యాయం" అని ఆమెకు సలహా చెప్పారు.

నిజానికి చాలామంది ఆ వ్యోమగాములు భూమి మీదకు సురక్షితంగా చేరేవరకు బాధపడుతూ ఉన్నారు. కొందరు సరిగ్గా భోజనం చెయ్యలేదు. దడదడలాడే గుండెలతో రేడియోల దగ్గరే కూర్చున్నారు.

మధ్య ఒక మెట్టు విరిగిన నిచ్చెన ఎక్కి మావారు బాదం ఆకులు కోస్తుంటే ఎంతో భయం వేస్తుంది.

"జాగ్రత్తండి జాగర్త. అంత ఇదిగా వుంటే దిగిరండి. బాదం ఆకులు లేకపోతే మానె. అన్నం ఎలాగో అలాగ తిందాం" అని నేనెన్నిసార్లో గందరగోళ పడిపోయాను.

"అలాంటిది ఎన్నో వేల మైళ్ళల్లో శకటం చెడి అపాయ స్థితిలో వున్న భర్తల్ని తలచుకున్నప్పుడు ఆ యిల్లాళ్ళ మనస్సులెలా వుంటాయో వర్ణించడమెలాగమ్మా" అని ఒక ముసలి ముత్తైదువ ఎంతో జాలి ప్రకటించింది.

"క్రిందటిసారి అపోలో పన్నెండులో పెద్ద మనుష్యులు చెప్పకుండా చంద్రమండలం మీద కాలు మోపారు. చంద్రుడా విషయం సరిగా గమనించలేదు. అందువల్ల ఏమీ చేయలేని స్థితిలో వుండిపోయాడు. కానీ, మళ్ళీ రానివ్వకూడదని పట్టుబట్టి వుంటాడు. అందుకని అపోలో వీరులు సగం దూరంలో ఉండగానే అడ్డుపంపివుంటాడెవరినో ఆ చంద్రయ్య" అని ఒకాయన వ్యాఖ్యానించాడు.

ఏది ఏమైనా ఈసారి అపోలో ప్రయాణం లోకాన్ని జాలి కెరటాల్లో ముంచి తేల్చింది. ఒక ముసలమ్మగారు అంది, "పాపం వాళ్ళకు ఆహారం లేదట. ఆక్సిజన్ సరిపోతుందో లేదోనని భయంగా వుందిట.. పోనీ ఆపదలో వున్నారుకదా ఆక్సిజన్ కొని పంపుదామంటే వీలుందో లేదో? నా మట్టుకు నేను వాళ్ళ క్షేమం కోసం పది రూపాయలు ముడుపు కడుతున్నాను. వాళ్ళను తలచుకుంటే నా ముగ్గురు తమ్ముళ్ళూ జ్ఞాపకం వస్తున్నారు" అంది.

అది విని ఆవిడ భర్త పకపకా నవ్వి "మీ తమ్ముళ్ళతో పోలుస్తావేమిటే? ముదురు గోడ ఎక్కలేని వీరులు. అన్నం వడ్డించటం అయిదు నిమిషాలు ఆలస్యమైతే మూర్ఛపోయే శూరులు... అంతరిక్షంలో అలా పకపకలాడుతూ పల్టీలు కొట్టి

దిగివచ్చినవారితోనా పోల్చేది. కావాలంటే ఆ ముగ్గురూ క్షేమంగా చేరినందుకు సంతోషిస్తూ ఒక ఉత్తరం వ్రాసి 'అక్కయ్య' అని సంతకం చెయ్యి" అన్నాడట.

"నిజంగా వాళ్ళు ముగ్గురూ మామూలు వాళ్ళు కాదు. అవతార మూర్తులు, త్రిమూర్తులు. అంతరిక్షంలో అలా విహరించి అలాగ్గా దిగి చక్కా వచ్చారు. మనం ఆదుర్దా పడ్డాంగాని వాళ్ళేం భయపడలా!

అవతార మూర్తులు కనుక ఆ చంద్ర శకటం అలా వారిని పూల విమానంలాగా తీసుకువచ్చి భూ పరిధిలో దింపి, చక్కా పోయింది. మరొకళ్ళయితే, ఎక్కడికి కొట్టుకుపోయేవారో. వెతికితే ఇటు యముడికీ కనబడేవారు కాదు, అటు దేవతలకీ కనిపించేవారు కాదు" అని ఒకాయన తన భావాన్ని ప్రస్ఫుటంగా వర్ణించాడు.

మీరెంతన్నా చెప్పండి, ఆ శక్తి వాళ్ళల్లో లేదని నేను ఘంటాపథంగా చెప్పగలను? అది వారి భార్యల మంగళసూత్రాల బలం.. అసలు కావలసిన సౌకర్యాలన్నీ అందులో ఉన్నాయి. ఎంతో ఆక్సిజన్, ఎంతో ఆహారం, ఎంతో జలం దాగి వున్నాయి ఆ సూత్రాలలో. ఒకాయనకి పెళ్ళి కాలేదుగాని లేకపోతే ఇంకా ముందే దిగేవారు. ఇంకా తేలిగ్గా దిగేవారు.

"సావిత్రి భర్తను యమలోకం నుంచి వెనక్కి తీసుకురాలా? దానికి మనమేమన్నా ఆశ్చర్యపడ్డామా? ఇదీ అంతే. ఈ చర్యవల్ల ఇద్దరు అమెరికన్ సావిత్రులు బయటపడ్డారు. వీరి చరిత్ర వ్రాయాలి. అమెరికావాళ్ళయితే, పొడిపొడిగా వ్రాస్తారు. మనవాళ్ళే వ్రాయాలి. మంచి కవిత్వం, వేదాంతం కలిసి" అని ఒకామె నిర్వచించింది.

నిజానికి అపోలో పదమూడు చరిత్ర 'రోదసీ ప్రబంధంలో ' ఒక కరుణారసపూరితమైన అధ్యాయం.

Post your comments